క్లుప్తంగా

సురక్షిత తాగునీటి సరఫరాకు చర్యలు

కంకిపాడు: సురక్షిత తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకుంటున్నామని దావులూరు సర్పంచ్ కె.లక్ష్మి అన్నారు. గ్రామంలో జలజీవన్ మిషన్ నిధులు రూ.24 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన పైపులైను, బోరు పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జలజీవన్ మిషన్ నిధులతో గ్రామానికి నూతన పైపులైను మంజూరైందని, మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందని వివరించారు. గ్రామానికి నిధులు మంజూరు చేసినందుకు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథికి ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నేతలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మండేపూడి శ్రీనివాసరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ ఘంటసాల పూర్ణచంద్రరావు, పార్టీ నేతలు వింతా సాంబిరెడ్డి, మసిముక్కు సాంబశివరావు, ఘంటసాల మురళీకృష్ణ ప్రసాద్, కె.సీతారామయ్య, ఈఓ సీహెచ్ శేఖర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్కూల్ కోసం మూడున్నర ఎకరాలు కేటాయింపు

నున్న(విజయవాడరూరల్): ప్రభుత్వ ఏపీఆర్ మైనార్టీ బాలికల రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు కోసం నున్న గ్రామంలో ఆర్ఎస్ నంబర్ 371/4,371/5లలో ఉన్న మూడున్నర ఎకరాల స్థలం కేటాయిస్తూ గ్రామ పంచాయతీ సర్వసభ్య సమావేశం తీర్మానం చేసింది. సోమవారం గ్రామ సర్పంచ్ కాటూరి సరళ శ్రీనివాస్ అధ్యక్షతన పంచాయితీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో గ్రామ కార్యదర్శి జీటీవీ రమణ అజెండాలోని అంశాలను చదివి వినిపించారు. అనంతరం రీసర్వే నంబర్ 371/3లో 50 సెంట్లు భూమిని అసోసియేషన్ ఆఫ్ పల్మనాలజిస్ట్స్ ఆఫ్ సీమాంధ్రకు కేటాయిస్తూ సమావేశం తీర్మాణం చేసింది. కోటకట్ట సెంటర్లో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయడానికి, గ్రామంలో వివిధ ఎల్ఈడీ లైట్లు ఏర్పాటుకు నిర్ణయం తీసుకుంది. గ్రామంలో ఓసీ, బీసీ శ్మశానాల్లో బోర్లు నిర్మించాలని తీర్మానించింది. పలు ప్రాంతాల్లో రోడ్లు, డ్రెయిన్లు నిర్మించడానికి సమావేశం తీర్మానం చేసింది. సమావేశంలో ఉప సర్పంచి కలకోటి బ్రహ్మానందరెడ్డి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీలో కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని సీఐటీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు షేక్ మస్తాన్‌వలి, ఉప్పాడ త్రిమూర్తి అన్నారు. తాడిగడప మున్సిపల్ కమిషనర్ ఎస్.ప్రకాశరావును సోమవారం కలిసి వినతిపత్రం ఇచ్చి వివరాలు తెలిపారు. కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్, గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. నెలాఖరుకల్లా పెండింగ్ జీతాలు చెల్లించాలని కోరారు. కార్మికులకు దుస్తులు, చెప్పులు, సబ్బులు, కొబ్బరి నూనె ఇవ్వాలన్నారు. 60 ఏళ్ల వయస్సు పైబడిన కార్మికులకు జీతాలు చెల్లించాలన్నారు. మున్సిపాలిటీ కమిషనర్ ఈ నెలాఖరుకల్లా సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో కార్మిక నేతలు యనమల సరళ, దుర్గారావు, వెంకటరెడ్డి, జి.లక్ష్మణ, బి.సత్యనారాయణ, బి.నాగబాబు, కందుల కోటేశ్వరరావు పలువురు పాల్గొన్నారు.

ఇరువర్గాల ఘర్షణ : పరస్పర కేసులు నమోదు

పెనమలూరు: యనమలకుదురులో మిత్రుల మధ్య ఘర్షణ జరగటంతో సోమవారం పోలీసులు కౌంటర్ కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రామలింగేశ్వరనగర్‌కు చెందిన ఉంగరాల హేమంత్ డెకరేషన్ పనులు చేస్తాడు. అతని సోదరుడు సాయిరాజారావు లారీ క్లీనర్‌గా పని చేస్తాడు. అన్నదమ్ములు ఇద్దరూ పెదపులిపాకకు చెందిన మిత్రులు షేక్ కరీమ్, బడుగు రాజేష్‌తో కలిసి మద్యం తాగారు. ఆ సమయంలో మాటామాటా పెరిగి ఘర్షణ తలెత్తింది. దీంతో పరస్పరం దాడులు చేసుకున్నారు. ఘర్షణలో గాయపడిన ఇరువర్గాలు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసులు నమోదు చేశారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం రేమల్లేకు చెందిన తిరువీధుల ఫణికుమార్ (44) అదృశ్యం కావటంతో వీరవల్లి పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన ఫణి కుమార్ ఈ నెల 5వ తేదిన ఇంటి నుంచి వ్యవసాయ పనుల నిమిత్తం సైకిల్‌పై బయటకు వెళ్లాడు. రాత్రి కావస్తున్న ఫణికుమార్ ఇంటికి రాకపోవటంతో ఆందోళన చెందిన భార్య ఛాయమ్మ గ్రామంలోనూ, బంధువులు, మిత్రుల వద్ద వెతుకులాట ప్రారంభించింది. ఈ నేపథ్యంలో ఆదివారం గ్రామ సమీపంలోని చెరువు వద్ద ఫణికుమార్ చెప్పులు, సైకిల్ కనిపించటంతో ఆందోళన చెందిన ఆ చెరువు మొత్తం తీవ్రంగా గాలించారు. కానీ ఎలాంటి ప్రయోజనం లభించలేదు. దీంతో వీరవల్లి పోలీసులు ఫణికుమార్ అదృశ్యమైనట్లు భార్య ఛాయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

వేరు పురుగుతో పంటకు చేటు

- రెండేళ్లుగా వివిధ పంటల్లో వేరు పురుగు ఉధృతి
- సస్యరక్షణ చర్యలతో పంటను కాపాడుకోవచ్చు
- దిగుబడులు ఆశాజనకంగా లభిస్తాయి
- ఉయ్యూరు వ్యవసాయ పరిశోధనాస్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ డి.సుధారాణి



హనుమాన్‌జంక్షన్‌లో వేరుపురుగు ఆశించిన చెరకు తోట



వేరుపురుగులు

కంకిపాడు: వేరు పురుగు...పలు పంటలను పీడిస్తున్న ప్రధాన సమస్య. గత రెండు, మూడేళ్లుగా ఈ పురుగు ఉధృతి ఎక్కువగా ఉండటంతో పంట దిగుబడులు తగ్గి రైతులు ఆర్థికంగా నష్టాలను చవిచూస్తున్నారు. తేలికపాటి నేలలు, తేమ తగినంత లేని పొలాల్లో ఈ పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటుంది. వేరు పురుగు ఉధృతిని ఉయ్యూరు వ్యవసాయ పరిశోధనాస్థానం శాస్త్రవేత్తలు, రైతుల బృందం ఇటీవల గుర్తించింది. సస్యరక్షణ చర్యలు తీసుకుంటే సాగు లాభదాయకంగా ఉండి, పంట దిగుబడులు కాపాడుకోవచ్చని వారు రైతులకు సూచించారు. గత మూడేళ్లుగా వేరుపురుగు సమస్య చెరకు, పసుపు, మినుము, వేరుశెనగ, జొన్న, మొక్కజొన్న పంటల్లో కనిపిస్తుంది. ఉయ్యూరు వ్యవసాయ పరిశోధనాస్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ డి.సుధారాణి ఇటీవల రైతులు, కేసీపీ సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయిలో పంట పొలాలను సందర్శించారు. ప్రస్తుతం చెరకు పంటను వేరుపురుగు పీల్చిపిప్పి చేస్తున్నట్లు గుర్తించారు.

వేరు పురుగు ఉధృతికి అనుకూల పరిస్థితులు

- సాధారణంగా వేరు పురుగు తల్లి పురుగులు నిద్రావస్థను కలిగి ఉంటుంది. తొలకరి వర్షాలు పడ్డాక భూమిలో నుంచి పురులు బయటకు వచ్చి ఆశ్రయం ఇచ్చే చెట్ల మీద చేరి సంపర్కం చెంది గుడ్లను నేలలో విడిచిపెడతాయి.
- పొలంకు దగ్గరలో తుమ్మ, వేప, రేగు వంటి పొడవైన చెట్లు ఉన్నప్పుడు, చెట్ల కొమ్మలు పడిపోయినప్పుడు ఈ తల్లి పురుగులకు ఆశ్రయం లభిస్తుంది.
- పంట చేలకు దగ్గరగా పెంటపోగు ఉన్నా, పూర్తిగా కుళ్లని పశువుల ఎరువును పొలంలో చల్లినా పురుగు ఆశించే అవకాశం ఉంటుంది.
- పొలంలో ఉన్న గుడ్ల నుంచి వచ్చిన పిల్ల పురుగులు చేలో తేమ తగినంత లేనపుడు ఉధృతి పెరిగి పొలమంతా వ్యాపిస్తాయి.

వేరుపురుగును గుర్తించటం ఎలా?

- తల్లి పెంకు పురుగులు ముదురు గోధుమ రంగు కలిగి ఉంటాయి. రాత్రి పూట చురుగ్గా వ్యవహరించి చెట్లపై ఉన్న ఆకులు తిని జీవిస్తాయి. పగలు పొలంలో చేరి గుడ్లు పెడతాయి.
- పిల్ల పురుగులు తెల్లగా సీ ఆకారంలో ఉంటాయి.

నష్టం ఇలా ఉంటుంది...

- వేరు పురుగులు మొక్కల వేర్లను, కాండాన్ని తినేయటం వల్ల మొక్కల ఆకులు తొలుత పసుపు రంగులోకి మారి క్రమేపీ ఎండిపోతాయి.
- పురుగు ఆశించిన మొక్కలు వాడి, ఎండి చనిపోతాయి. మొక్కను పీకితే సులువుగా ఊడి వస్తుంది.
- మొక్కలు గుంపులుగా చనిపోతాయి. బెట్ట పరిస్థితుల్లో ఒక్కోసారి పంట మొత్తం చనిపోతుంది.

యాజమాన్య చర్యలు ఇలా చేపట్టాలి

- తొలకరి వర్షాల సమయంలో దీపపు ఎర పెట్టడం వల్ల తల్లిపురుగును ఆకర్షింపచేసి చంపవచ్చు. ఒక హెక్టారుకు దీపపు ఎర సరిపోతుంది. పొలం చుట్టూ ఉన్న రేగు, తుమ్మ, వేప చెట్లు, వాటి కొమ్మలను కత్తిరించాలి. పడిపోయిన, వాలిన చెట్ల కొమ్మలను తొలగించాలి.
- చెట్లపై వేపనూనె 5.0 మిల్లీలీటర్లు, లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీలీటర్లు లేదా క్లోరిపైరిఫాస్ 2.5 మిల్లీలీటర్లు లీటరు నీటికి కలిపి సాయంత్రం వేళల్లో పిచికారీ చేసుకోవాలి. చెట్ల మొదళ్లలో ఉన్న పురుగులను సేకరించి చంపివేయాలి.
- వేసవి దుక్కులను తప్పనిసరిగా చేసుకోవాలి. తద్వారా కోశస్థదశలో ఉన్న పురుగులు సూర్యరశ్మికి చనిపోతాయి. పంట మార్పిడి విధానాన్ని అవలంబించాలి.

రసాయన చర్యలు చేపట్టాలి



విత్తే ముందు పొలంలో ఒక ఎకరాకు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు 10 కిలోలు/ఫిప్రోనిల్ 0.3 జి గుళికలు 8–10 కిలోలు వేసుకోవాలి. విత్తన శుద్ధి కోసం ఒక కిలో విత్తనానికి క్లోరిపైరిఫాస్ 10 మిల్లీలీటర్లు/ఇమిడాక్లోప్రిడ్ 2.0 మిల్లీలీటర్లు ఉపయోగించాలి. ఎదిగిన పైరు/తోటలో పురుగు ఆశిస్తే మొక్కల మొదళ్లలో గుంటలు చేసి ఫిప్రోనిల్ 0.3జి గుళికలు 10 కిలోలు లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.4జి గుళికలు 8 కిలోలు ఒక ఎకరాకు వాడుకోవాలి. ఉధృతి బట్టి మొక్కల మొదళ్లు బాగా తడిచేలా క్లోరిపైరిఫాస్ 2.5మిల్లీలీటర్లు/ క్వినాల్‌ఫాస్ 2.0మిల్లీలీటర్లు/ఇమిడాక్లోప్రిడ్+ప్రిఫోనిల్ 1.0గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. తద్వారా పంట దిగుబడులకు కలిగే నష్టాన్ని అధిగమించి లాభాలను పొందొచ్చు.

–డాక్టర్ డి.సుధారాణి, సీనియర్ శాస్త్రవేత్త, వ్యవసాయ పరిశోధనాస్థానం, ఉయ్యూరు

- జీవనియంత్రణ పద్ధతుల్లో బయో రసాయనం– మోటారైజియమ్ ఎనిసోప్లియేను 2 కిలోలు 100 కిలోల పశువుల ఎరువుతో కలిపి పొలంలో పంట నాటే ముందు ఒకసారి, ఉధృతి బట్టి తొలకరి వానలు తరువాత మరోసారి వేసుకోవాలి.

హెటిరోరాబ్డైటిస్ ఇండికా అనే నులిపురుగు జీవరసాయనం 2 కిలోలు 100 కిలోల పశువుల ఎరువుతో కలిపి వాడినప్పుడు మంచి ఫలితాలు ఉంటాయి. వేరు పురుగుల ఉధృతి అధికంగా ఉన్నప్పుడు పొలంలో 2–3 రోజులు పాటు నీళ్లు వదలాలి.

మూడు విడతల్లో వ్యాక్సినేషన్



పోరంకిలో ఇంద్రధనుష్ కార్యక్రమంలో భాగంగా వాక్సినేషన్ చేస్తున్న సిబ్బంది

పెనమలూరు: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మిషన్ ఇంద్రధనుష్ పథకంతో మూడు విడతల్లో వ్యాక్సినేషన్ కార్యక్రమం మున్సిపాలిటీ పరిధిలో నిర్వహిస్తామని తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ డాక్టర్ ఎస్.ప్రకాశరావు అన్నారు. పోరంకిలో సోమవారం ఇంటెన్సిఫైడ్ మిషన్ ఇంద్రధనుష్ 5.0లో భాగంగా ఆయన చిన్నారులకు వాక్సిన్ వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమాన్ని మూడు విడతలుగా నిర్వహిస్తాయన్నారు. ఆగస్టు 7నుంచి 12వరకు, సెప్టెంబర్ 11 నుంచి 16 వరకు, అక్టోబర్ 9 నుంచి 14 వరకు వాక్సినేషన్ వేస్తారన్నారు. 0–5 సంవత్సరాలలోపు పిల్లలకు, గర్భిణులకు వ్యాధి నిరోధక టీకాలు వేయటమే ఆరోగ్యమిషన్ ఇంద్రధనుష్ 5.0 లక్ష్యమన్నారు. పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేయించి 2023 సంవత్సరం నాటికల్లా పొంగు, తట్టు, రూబెల్లా వంటివి లేకుండా చేస్తామని అన్నారు. ఖరీదైన టీకాలు ప్రభుత్వం ఉచితంగా వేస్తుందని, తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకుని టీకాలు వేయించాలని కమిషనర్ సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ అభినేష్, వైద్యాధికారి ఎస్.రవికుమార్, సూపర్‌వైజర్ పురుషోత్తమరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జంక్షన్‌లో క్రైస్తవుల శాంతి ర్యాలీ



హనుమాన్‌జంక్షన్ ప్రధాన కూడలిలో మానవహారంగా ఏర్పడి నిరసన తెలుపుతున్న క్రైస్తవులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: మణిపూర్‌లో క్రైస్తవులు, చర్చిలపై జరుగుతున్న దాడులకు నిరసనగా హనుమాన్‌జంక్షన్‌లో భారీ శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక గుడివాడరోడ్డులోని జ్యోతినగర్ ఆర్సీఎం చర్చి వద్ద ఫాదర్ జోసఫ్ తంబి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. వందలాది క్రైస్తవులు ర్యాలీలో పాల్గొని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. మణిపూర్‌లో క్రైస్తవులపై దాడులను ముక్తకంఠంతో ఖండించారు. క్రైస్తవ మైనార్టీలకు ప్రభుత్వం భద్రత కల్పించాలి. స్త్రీల ఆత్మగౌరవాన్ని కాపాడాలని, మణిపూర్ క్రైస్తవులకు సంఘీభావం తెలుపుతూ ప్లకార్డులు ప్రదర్శించారు. హనుమాన్‌జంక్షన్ ప్రధాన కూడలిలో మానవహారంగా ఏర్పడి నిరసన వ్యక్తం చేశారు. హోసన్న మందిర్ పాస్టర్ ఎం.దేవదాస్ మణిపూర్ క్రైస్తవుల భద్రత, క్షేమం కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం బాపులపాడు తహసీల్దార్ కార్యాలయానికి ర్యాలీగా చేరుకున్నారు. తహసీల్దార్ సీహెచ్ నరసింహారావుకు వినతిపత్రం అందజేశారు. వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొమరవల్లి కిరణ్‌మూర్తి, బాపులపాడు సర్పంచ్ సరిపల్లి కమలాభాయి, వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వెలగపల్లి ప్రదీప్, టీడీపీ మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు, పాస్టర్లు పాల్గొన్నారు.

నడిపల్లికి జీవిత సాఫల్య పురస్కారం



రవికుమార్‌కు అవార్డు ప్రదానం చేస్తున్న తెలంగాణ నీటిపారుదల శాఖ చైర్మన్ వేణుగోపాలచారి

పెనమలూరు: ప్రముఖ చిత్రకారుడు, మైక్రో ఆర్టిస్టు, పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆర్ట్ టీచర్‌గా పని చేస్తున్న నడిపల్లి రవికుమార్ జీవితకాల సాఫల్య పురస్కారం అందుకున్నారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన కల్చరల్ అకాడమీ సృజన ఆర్ట్ క్రియేషన్స్ జాతీయ సమైక్యత అవార్డు 2023 ఆదివారం హైదరాబాద్‌లో ప్రదానం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ నీటిపారుదల శాఖ చైర్మన్ డాక్టర్ ఎస్.వేణుగోపాలాచారి అవార్డును రవికుమార్‌కు అందజేశారు. చిత్రకళా రంగంలో 25 ప్రపంచ రికార్డులు నెలకొల్పి గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం పొందిన చిత్రకారుడు రవికుమార్‌కు అరుదైన గౌరవం లభించింది. ఈ సందర్భంగా పెనమలూరు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వై.దుర్గాభవాని, ఉపాధ్యాయులు, చిత్రకారులు అభినందనలు తెలిపారు.

జాతీయస్థాయి రోల్‌బాల్ పోటీలకు ఎంపికైన ఎష్మిత

విద్యార్థినిని అభినందించిన సెయింట్‌మేరీస్ ప్రిన్సిపాల్ సిస్టర్ చిత్ర



విద్యార్థిని ఎష్మితను అభినందిస్తున్న కరస్పాండెంట్ ఎం.సాల్మన్‌రాజు

కంకిపాడు: రాష్ట్రస్థాయి రోల్‌బాల్ చాంపియన్ షిప్ పోటీల్లో ప్రతిభ చాటి కంకిపాడు సెయింట్ మేరీస్ విద్యార్థిని జి.ఎష్మిత జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా ఎష్మితను సోమవారం కరస్పాండెంట్ ఎం.సాల్మన్‌రాజు ప్రత్యేకంగా అభినందించారు. గుంటూరులో గత నెల 30న 5వ రాష్ట్ర స్థాయి రోల్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో ఎష్మిత అండర్–11 బాలికల విభాగంలో బంగారు పతకాన్ని కైవసం చేసుకుని జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సిస్టర్ చిత్ర, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.సుధాపాల్ మార్క్, విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు.

పేరంటాలమ్మ సేవలో ఎంపీ మోపిదేవి



రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో సోమవారం ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది వెంకటరమణను ఆలయ మర్యాదలతో ఆహ్వానించారు. అమ్మవారికి నిర్వహించిన అర్చన, ప్రత్యేక పూజా కార్యక్రమాలల్లో పాల్గొని తీర్థప్రసాదాలు అందుకున్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

ఆగిరిపల్లి(నూజివీడు): వ్యక్తి అదృశ్యంపై ఆగిరిపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. కృష్ణాజిల్లా గన్నవరం మండలం గొల్లనపల్లికి చెందిన కుందేటి రాంబాబు(55) ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం వడ్లమానులోని మామిడితోటలో కాపలా నిమిత్తం భార్యతో కలిసి ఉంటున్నాడు. ఈ నెల 1న తోటలోని ఇంటి నుంచి బయటకు వెళ్లి ఇంతవరకు తిరిగి రాలేదని, బంధువుల ఇళ్ల వద్ద, స్నేహితుల ఇళ్ల వద్ద వెతికినా ఎక్కడకు వెళ్లకపోవడంతో అతని భార్య శీనమ్మ సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నంబూరి చంటిబాబు తెలిపారు.

మత్తు పదార్థాలను నియంత్రించాలి

ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ప్రభావతి



పోరంకిలో పాదయాత్ర నిర్వహిస్తున్న ఐద్వా నాయకులు

పెనమలూరు: మద్యం, మత్తు పదార్థాలు నియంత్రించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) రాష్ట్ర అధ్యక్షురాలు బి.ప్రభావతి అన్నారు.హింసపై మహిళల పాదయాత్ర రాష్ట్ర జాతా సోమవారం పోరంకి చేరుకున్న సందర్భంగా ఆమె ప్రసంగించారు. మద్యం, మత్తు పదార్థాలను దశలవారీగా నియంత్రించాలని సూచించారు. వారానికి ఒక రోజు డ్రైడేగా పాటించాలని తెలిపారు. మణిపూర్‌లో మహిళలను ఘోరంగా అవమానపరిచి, అత్యాచారం చేసి, హత్య చేసిన ఘటనలు దారుణమన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మణిపూర్ ఘటనలపై స్పందించటం లేదని విమర్శించారు. పాదయాత్రలో ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.పూర్ణ, సహాయ కార్యదర్శులు సత్యవతి, సీహెచ్ రమణి, జిల్లా నాయకులు పి.లక్ష్మి, భవాని, నాగమణి, లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

అవ్వాతాతల ఆరోగ్య సంరక్షణకు చర్యలు

కంకిపాడు: అవ్వాతాతల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఉప్పలూరు పీహెచ్‌సీ ఆప్తాలమిక్ ఆఫీసర్ వి.వి.రాజేష్‌కుమార్ అన్నారు. మండలంలోని ప్రొద్దుటూరులో డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. 108 మంది అవ్వాతాతలకు కంటి పరీక్షలు చేశారు. కంటి సమస్యలతో బాధపడుతున్న వృద్ధులకు అవసరమైన మందులు అందించారు. ఆప్తాలమిక్ ఆఫీసర్ రాజేష్‌కుమార్ మాట్లాడుతూ కంటి సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించి అవసరమైన వైద్యం పొందాలన్నారు. అవ్వాతాతల ఆరోగ్య సమస్యలకు ఉన్నత ప్రమాణాలతో కూడిన వైద్యం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని వివరించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ కుసుమ, ఏఎన్ఎం ప్రశాంతి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

29న అరుణాచలంనకు ప్రత్యేక బస్సు సర్వీసు

ఉయ్యూరు: ఉయ్యూరు ఆర్టీసీ డిపో నుంచి ఈనెల 29న అరుణాచలంకు ప్రత్యేక బస్సు సర్వీసు నడపనున్నట్లు డిపో మేనేజర్ కె.ఎస్.ఆర్.కె.ప్రసాద్ తెలిపారు. స్థానిక డిపో కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 29వ తేదీ రాత్రి 7 గంటలకు ఉయ్యూరు డిపో నుంచి సూపర్‌లగ్జరీ బస్సు బయలుదేరి 30వ తేదీన కాణిపాకం, అనంతరం సిరిపురం (గోల్డెన్ టెంపుల్) దర్శనం, అదే రోజు రాత్రి అరుణాచలం చేరుతుందన్నారు. 31న పౌర్ణమి సందర్భంగా గిరి ప్రదక్షిణ, దర్శనం పూర్తి చేసుకుని కాంచీపురం, తిరుత్తణి కుమారస్వామిని దర్శించుకుని శ్రీకాళహస్తి దర్శనం, సెప్టెంబరు 1న ఉయ్యూరు డిపో చేరుతుందన్నారు. టిక్కెట్ ధర రూ.3 వేలు, ఆఫ్ టిక్కెట్ రూ.2250గా నిర్ణయించారన్నారు. విజయవాడ నుంచి అయితే టిక్కెట్ రూ.2900, ఆఫ్ టిక్కెట్ రూ.2175గా నిర్ణయించారన్నారు. సర్వీసు నంబరు 95599 ద్వారా ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం కల్పించామన్నారు. వివరాలకు 73828 93468 నంబరులో సంప్రదించాలని కోరారు.

భూమిని కాపాడాలని స్పందనలో విజ్ఞప్తి

గన్నవరం: తన వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా చూపించి స్వాహా చేసేందుకు ఓ ముఠా చేస్తున్న ప్రయత్నాలకు అడ్డుకట్ట వేయాలని జెడ్పీటీసీ మాజీ సభ్యులు ఎంవీఎల్. ప్రసాద్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం మచిలీపట్నంలో జరిగిన స్పందనలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం కేసరపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేసరపల్లిలో 3.43 ఎకరాల వ్యవసాయ భూమిని మేకా వెంకటసామ్రాజ్యలక్ష్మి నుంచి 1996లో కొనుగోలు చేసినట్లు తెలిపారు. అందులో 45 సెంట్లను జాతీయ రహదారి విస్తరణ నిమిత్తం ప్రభుత్వం సేకరించి రూ. 4.49 లక్షలు పరిహారం తనకు చెల్లించినట్లు చెప్పారు. మిగిలిన 2.98 ఎకరాలపై ఎటువంటి హక్కూ లేని మేకా నవనీతం కృష్ణ అప్పారావు, అతని కుమారై లక్ష్మీదివ్యలు 2007లో లీలాబాయి, ఇంతియాజుద్దీన్, పారూఖ్, రవికుమార్‌కు గన్నవరం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అస్వాధీనపు విక్రయ అగ్రిమెంట్ కమ్ జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ రిజిస్ట్రేషన్ చేసినట్లు తెలిపారు. ఇటీవల నవనీతం కృష్ణ అప్పారావు మరణించడంతో పవర్ ఆఫ్ అటార్నీ చెల్లదన్నారు. అయినప్పటికీ తన భూమిని వేరే వ్యక్తులకు విక్రయించి సొమ్ము చేసుకునేందుకు నలుగురు ముఠా ప్రయత్నాలు చేస్తోందని, సదరు అక్రమ దస్తావేజులను రద్దు చేయాలని స్పందనలో కోరినట్లు తెలిపారు.

ఎంప్లాయీస్ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ డైరెక్టర్‌గా లోయ



లోయ శివశంకర్‌రావు

పెనమలూరు: పెనమలూరు మండల పరిషత్ కార్యాలయంలో పరిపాలనా అధికారిగా విధులు నిర్వహిస్తున్న లోయ శివశంకర్‌రావు కృష్ణాజిల్లా పరిషత్ ఎంప్లాయిస్ కో–ఆపరేటీవ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్‌లో డైరెక్టర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మచిలీపట్నంలో ఆదివారం కృష్ణాజిల్లా పరిషత్ ఎంప్లాయిస్ కో–ఆపరేటీవ్ క్రెడిట్ సొసైటీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ఈమేరకు ప్రమాణస్వీకారం చేశారు.ఈ సందర్భంగా పెనమలూరు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీడీఓ సునీతా శర్మ, మండల పరిషత్ ఉద్యోగులు శివశంకర్‌రావును ఘనంగా సత్కరించారు.

ఓటమి భయంతోనే విధ్వంస రచన



గన్నవరం: ఓటమి భయంతోనే చంద్రబాబునాయుడు రాష్ట్రంలో విధ్వంసాలు, అరాచకాలు సృష్టిస్తున్నారని వైఎస్సార్ సీపీ నాయకులు ఆరోపించారు. స్థానిక శాసనసభ్యుడి కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఏఎంసీ చైర్మన్ రామిశెట్టి అంజనీకుమారి, ఎంపీపీ అనగాని రవి, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎండీ. గౌసాని టీడీపీ వైఖరిని ఎండగట్టారు. ప్రాజెక్టల సందర్శన పేరుతో చంద్రబాబు రాష్ట్రంలో హింసను ప్రేరేపించేందుకు కుట్ర పన్నారన్నారు. దీనిలో భాగంగానే పుంగనూరులో విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై టీడీపీ శ్రేణులు దాడులు చేసే విధంగా చంద్రబాబు రెచ్చకొట్టే వ్యాఖ్యలు చేశారని తెలిపారు. తిరిగి ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేయడం దుర్మార్గమన్నారు. పార్టీ మండల అధ్యక్ష, కన్వీనర్లు పడమట సురేష్, నీలం ప్రవీణ్‌కుమార్, సచివాలయాల కన్వీనర్ కైలే శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం



కిచెన్ షెడ్డు ప్రారంభిస్తున్న ఎంపీపీ అనగాని రవి

గన్నవరం రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎంపీపీ అనగాని రవి చెప్పారు. సోమవారం బీబీగూడెం ఎంపీపీ జేబీ పాఠశాలలో మండల పరిషత్ నిధులు రూ.3.10లక్షలతో నిర్మించిన కిచెన్ షెడ్డు, వాటర్ ట్యాంకును ఆయన ప్రారంభించారు. అనంతరం కిచెన్ షెడ్డు ప్రారంభించి మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ఎంఈవో–2 కమల, సర్పంచ్ డి.జయలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు మోరంం నాగరాణి, సొసైటి చైర్మన్ బోయపాటి మురళీకృష్ణ, మాజీ సర్పంచ్ బోయపాటి బసవపూర్ణయ్య, పేరెంట్స్ కమిటీ చైర్మన్ కాండ్రు షైనిక, ఉప సర్పంచ్ కె.ధర్మారావు పాల్గొన్నారు.